క్లుప్తంగా

నల్లగంగమ్మ వెండి కవచానికి రూ.50,105 విరాళం



విరాళం అందజేస్తున్న చంద్రయ్య

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెట్టు ప్రాంతంలో వెలసిన నల్లగంగమ్మకు వెండి కవచం చేయించడానికి యూఎస్ఏలో ఉంటున్న సజ్జా అవినాష్ తన తండ్రి చంద్రయ్య ద్వారా రూ.50,105లను విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును సోమవారం ఆలయ చైర్మన్ కంఠా రమేష్ స్వీకరించారు. వారికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సభ్యులు నారాయణ, అనిల్, యాదగిరి, సుధాకర్, పూజారి గుణ, కుప్పయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ విజ్ఞానగిరిలో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. మహా మండపం నిర్మాణ పనులు వచ్చే ఆడికృత్తిక నాటికి పూర్తిచేయాలని సూచించారు. కొండపై కల్యాణ కట్టను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు నూకరత్నం, పవన్‌కుమార్, బాలాజీ, కాంట్రాక్టరు గుమ్మడి బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

మంచి, చెడు స్పర్శపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో-2 దయాకర్

ఏర్పేడు: బాలికలు ఆత్మ సంరక్షణ ఎలా చేసుకోవాలని తెలుసుకోవాలని ఎంఈవో-2 దయాకర్ తెలిపారు. అంజిమేడు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం మంచి, చెడు స్పర్శపై బాలికలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలంటే పాఠశాల స్థాయి నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కిశోర బాలికలు ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకుంటే రక్తహీనత లేకుండా ఉంటారని చెప్పారు. ఆ

నాగలాపురం-టీపీ కోట రోడ్ల మరమ్మతులు ప్రారంభం



జేసీబీతో చదును చేయిస్తున్న నాయకులు

నాగలాపురం: మండలంలోని నాగలాపురం నుంచి టీపీ కోట వరకు రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచనల మేరకు సోమవారం జేసీబీతో చదును చేసి తరువాత రానున్న రోజుల్లో గ్రావెల్, కంకర పనులు పూర్తి చేసి తారు రోడ్డు త్వరలోనే నిర్మిస్తామని మండల అధ్యక్షుడు అపరంజిరాజు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిన్నదొరై, ఎంపీపీ సింధూ శ్యామ్, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, ఎస్ఎం సురేష్, ఎంపీటీసీ రాజా, దేశప్పన్, కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'పీఏసీఎస్ ఎంప్లాయీస్' రాష్ట్ర కార్యదర్శిగా చిరంజీవిరెడ్డి



తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఎంప్లాయీస్ యూనియన్ శాఖ రాష్ట్ర కార్యదర్శిగా చిరంజీవిరెడ్డి ఎన్నికయ్యారు. ఆయన తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్నారు. ఆయన ఎంపికపై సంఘం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



నాగలాపురం: స్థానిక పోలీసు స్టేషన్‌ను పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌కు విచ్చేసినట్లు చెప్పారు. అనంతరం కార్యాలయ రికార్డులను, సీడీ ఫైళ్లను పరిశీలించారు. అందులో చాలావరకు కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వెంటనే వాటిని పరిష్కరించాలని, ఇంతకముందు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ హనుమంతప్పకు రికార్డులను పంపించారు. తొందరలో జిల్లా ఎస్పీ తనిఖీ ఉన్నందున రికార్డులను ఆధునీకరణ చేయాలని ఎస్ఐ ఓబయ్యకు సూచించారు.

తేలని వెలుగులో అక్రమ రుణాల కేసు

- కేసు నమోదు చేసి ఏడాది
- అరెస్టు కాని కీలక నిందితులు
- బ్యాంకులకు రికవరీ కాని రుణాలు
- త్వరలోనే అరెస్టు చేస్తాం : సీఐ



వరదయ్యపాళెం వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు (ఫైల్)

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోని ఇందిరక్రాంతి (వెలుగు) పథకంలో సిబ్బంది రూ.3 కోట్ల మేరకు అక్రమ రుణాలు తీసుకుని చేతివాటం చూపిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడాది అవుతున్నా కేసులో ఏమాత్రం పురోగతి లేదు. నకిలీ గ్రూపుల ద్వారా అక్రమ రుణాలు పొందిన ఏపీఎం, మరికొందరు సంఘమిత్రలు ఎనిమిది మందిని అధికారులు సస్పెండ్ చేశారు. వారిపై పోలీసు కేసు కూడా నమోదైంది. వీరిలో ప్రధాన నిందితులైన అప్పటి ఏపీఎం సీబీ జ్యోతి, సంఘమిత్ర దేవిని ఇప్పటి వరకు అరెస్టు చేయలేదు. మిగిలిన వారిలో అందరు అరెస్టు అయి బెయిల్‌పై బయటికి వచ్చారు. అప్పటి ఏపీఎం సీబీ జ్యోతి రూ.64 లక్షలు, సంఘమిత్ర దేవి రూ.86 లక్షలు స్వాహా చేసినట్టు తేలింది.

నిందితుల అరెస్టులో నిర్లక్ష్యమెందుకు?:

సరిగ్గా గత ఏడాది అక్టోబర్ 27న వెలుగు అక్రమ రుణాలు కేసు వెలుగులోకి వచ్చింది. ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై మతలబు ఏమిటని బాధితులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం నూతన సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని, దాన్ని ఆధారం చేసుకుని నిందితులను అరెస్టు చేసే అవకాశం ఉన్నా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబడుతున్నారు.

బ్యాంకులకు నో రికవరీ:

అమాయక గిరిజనుల పేరుతో నకిలీ గ్రూపులు ఏర్పాటు చేసి అక్రమంగా రూ.3 కోట్ల వరకు రుణాలు పొంది పెద్దఎత్తున ఆస్తులు కూడబెట్టుకున్న వెలుగు సిబ్బంది నుంచి అధికారులు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదు. అప్పట్లో అక్రమాలకు పాల్పడిన వారి ఆస్తులను జప్తు చేసి బ్యాంకులకు రుణాలు చెల్లించి తమకు విముక్తి కల్పించాలని బాధిత గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు నిందితులపై చర్యలు తీసుకుంటామని అప్పటి తహసీల్దార్, ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రుణాలు చెల్లించాలని బ్యాంకు అధికారులు తరచూ అమాయక గిరిజనులపై ఒత్తిడి తెస్తున్నారు.

అందని రుణాలు

వరదయ్యపాళెంలోని డీసీసీ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, స్టేట్ బ్యాంకుల్లో దాదాపు 45 నకిలీ గ్రూపుల పేరిట రూ.3 కోట్లకు పైగా రుణాలు పొందారు. వాటిని తిరిగి బ్యాంకులకు చెల్లించని కారణంగా సంబంధిత గ్రూపుల వారికి రుణాలు ఇవ్వడం లేదు. అధికారులు చేసిన అక్రమాలకు తాము బలైయ్యామని, నెలనెలా కచ్చితంగా రుణాలు చెల్లించినప్పటికీ మళ్లీ ఇవ్వడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పక్కదారి పట్టిన రుణాలను జప్తు చేసి బ్యాంకులకు రికవరీ చేయాలని, అలాగే ప్రధాన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని కోరుతున్నారు.

త్వరలోనే అరెస్టు చేస్తాం

వెలుగు అక్రమ రుణాలకు సంబంధించిన కేసులో విచారణ చేపట్టాం. ఇందులో అప్పటి ఏపీఎం జ్యోతి, సంఘమిత్ర దేవి కీలక పాత్ర పోషించినట్టు తేలింది. వారిని ప్రత్యేక బృందాల ద్వారా అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే అరెస్టు చేస్తాం.

–శివకుమార్‌రెడ్డి, సత్యవేడు సీఐ

స్వర్ణ దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు



శ్రీనారాయణి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: తమిళనాడులోని రాయవేలూరులో వెలసిన స్వర్ణ దేవాలయంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని శ్రీ నారాయణి అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం, అమ్మవారి కృపతో 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ



ఇందిరానగర్ పంచాయతీలో విచారణ చేస్తున్న గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో 2016 నుంచి 2023 వరకు జరిగిన పంచాయతీ నిధుల అవకతవకలపై సోమవారం విచారణ చేపట్టారు. కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులు గుత్తి త్యాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ స్పందించారు. ఆ మేరకు కలెక్టర్ నియమించిన గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ రికార్డులు పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. తమ కార్యాలయంలో సంవత్సరం వారీగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు ఉన్నారు.

3న విద్యార్థులకు సామర్థ్య పరీక్ష



మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్‌పై ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023వ సంవత్సరానికి సంబంధించి స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్‌లో భాగంగా శ్రీకాళహస్తిలోని డిగ్రీ కాలేజీ విద్యార్థులను ఇన్వెస్టిగేటర్స్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వీరు మండలంలోని 33 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి నవంబరు 3వ తేదీన పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల సామర్థ్యం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వచ్చే నెల 18న మాదిగల విశ్వరూప మహాసభ



మాట్లాడుతున్న నాయకులు

శ్రీకాళహస్తి: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నవంబరు 18న మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ల రాజా తెలిపారు. ఆయన ఆదివారం శ్రీకాళహస్తిలో ఎమ్మార్పీఎస్ సభ్యుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంద పెంచలయ్య మాదిగ మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణ చట్టబద్ధత కోసం మందకృష్ణ మాదిగ 29 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలో నవంబరు 18న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. వెంబడి రాధాకృష్ణ, పులికుంట్ల గోపి, వేలూరు రాజేంద్రమాదిగ, తురక అమర్‌నాథ్ వడ్డెర తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో జంతువధశాల, చేపల మార్కెట్ నిర్వహణకు నూతన గదుల నిర్మాణానికి పంచాయతీ నుంచి రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు సోమవారం పంచాయతీ గదుల నిర్మాణానికి సంబంధించి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గత కొంతకాలంగా రోడ్ల పక్కనే పంచాయతీ జంతువధశాల, చేపల మార్కెట్ నిర్వహణ జరిగేది. అయితే ఆరుబయట దుకాణాలు నిర్వహించకుండా వాటికి ప్రత్యేక గదులు కేటాయించాలని స్థానికులు విన్నవించడంతో ప్రత్యేక వ్యాపార సముదాయ గదులను నిర్మించాలని పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. నూతన గదులు నిర్మించి జంతువధశాల, చేపల మార్కెట్‌కు వేర్వేరుగా గదులు కేటాయించనున్నట్లు పంచాయతీ ఈఓ బసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కాళంగి రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు



ఆదినారాయణ నాయుడు, డీఈ

సత్యవేడు: నియోజవర్గ పరిధిలోని కేవీబీపురం మండలంలో దెబ్బతిన్న కాళంగి రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు త్వరలోనే చేయనున్నట్టు ఇరిగేషన్ డీఈ ఆదినారాయణ నాయుడు తెలిపారు. సోమవారం సత్యవేడు ఇరిగేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళంగి రిజర్వాయర్‌లో 10 గేట్లు మరమ్మతులకు రూ.15 లక్షలు అవసరం ఉందని ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. ఇప్పటికే రూ.10 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు చేపట్టి ఆలస్యం అయిన చెరువుల అభివృద్ధి పనులు కూడా పూర్తి చేస్తామన్నారు.

రాంబాబు కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి



అధికారులతో మాట్లాడుతున్న తురక అమర్‌నాథ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన బత్తల రాంబాబు కుటుంబాన్ని ఆదుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్ వడ్డెర కోరారు. ఆయన సోమవారం శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో సూపర్‌వైజర్ మారయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో యాజమాన్యం ఉద్యోగులపై తీవ్ర పనిభారం మోపుతోందన్నారు. పని ఒత్తిడి తగ్గించాలన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, గోపి, రాజేంద్ర, వాసుదేవరావు, నరేష్, మహేష్, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ప్రీ ప్రైమరీ స్కూల్ భవనం ప్రారంభం



ప్రిప్రైమరీ స్కూల్ భవనం ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరత్నమ్మ

రేణిగుంట: మండలంలోని విప్పమానుపట్టెడలో సోమవారం ప్రీ ప్రైమరీ(అంగన్‌వాడీ) ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరత్నమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు అధునాతన వసతులతో కూడిన అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించడం సంతోషంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతి పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో కురుస్తున్న భారీ వర్షం

భారీ వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం చాలాసేపు పడింది. దీంతో మండలంలో 11 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షానికి చెరుకు, మామిడి సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆలత్తూరు, కొత్తకండ్రిగ, చిన్నయగుంట, పూసలపల్లి, ఆర్.అనంతాపురం గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయమయ్యాయి. వరినాట్లు వేయడానికి రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు జ్ఞాపిక, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్వీపీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బీఎంఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతగా కరకంబాడి జట్టు, రన్నర్‌గా శ్రీకాళహస్తికి చెందిన ఎస్ఎస్‌కే జట్టు నిలిచింది. వారు సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఆయన విజేతలకు రూ.50 వేల చెక్కు, జ్ఞాపిక, రన్నర్‌కు రూ.25 వేలు చెక్కు, జాపిక అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో నియోజకవర్గ ఖ్యాతిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, నిర్వాహకులు ఫరూఖ్, బాలాజీ, నేతాజీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మినరల్ వాటర్ ప్లాంట్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు. ఆమె సోమవారం జంగాలపల్లిలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో 30 ఏళ్ల టీడీపీలో జరగని అభివృద్ధి 4 ఏళ్లలో జరిగిందన్నారు. ప్రతినిత్యమూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, సర్పంచ్ బొర్రా నారాయణ, నాయకులు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, శేషాచలం, విజయ, చెంగయ్య, పాండు, కిరణ్, గోవర్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల త్యాగం వెలకట్టలేనిది



శ్రీసిటీలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జగదీష్‌నాయక్

సత్యవేడు: సమాజ శ్రేయస్సులో పోలీసుల పాత్ర, త్యాగాలు వెలకట్టలేనివంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీసిటీ ఫౌండేషన్, నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శ్రీసిటీ పోలీసులు బిజినెస్ సెంటర్‌లో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సులో పోలీసుల పాత్ర, వారి త్యాగాల గురించి తెలిపారు. ప్రజారోగ్య ప్రాముఖ్యత దృష్ట్యా శ్రీసిటీ యాజమాన్యం సహకారంతో ప్రతి ఏడాది రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. టెక్నాలజీ పరంగా వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధిస్తున్నా రక్తానికి సంబంధించి ఎలాంటి ప్రత్యామ్నాయాలు లేవన్నారు. అత్యవసర సమయాల్లో రోగులను బతికించంలో రక్తదానం అత్యంత కీలకం అని ఆయన తెలిపారు. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంచి, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఏటా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్న శ్రీసిటీ పోలీసులను ఆయన అభినందించారు. శిబిరంలో రక్తదానం చేసిన పోలీసు సిబ్బంది, శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు, పరిసర గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్వో మధుసూధనరావు, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్సలెంట్‌ఫార్మా సైన్స్, వెర్మీరెన్ ఇండియా రిహాబ్, కోల్‌గేట్, పామోలివ్, ఫాక్స్‌కాన్, హంటామాకి-పీపీఎల్ పరిశ్రమల ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, శ్రీసిటీ సెక్యూరిటీ, విద్యార్థులు, పరిసరగ్రామాల ప్రజలతో సహా 101 మంది రక్తదానం చేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్) రమేష్‌కుమార్, సెక్యూరిటీ చీఫ్ రమేష్, శ్రీసిటీ సీఐ భాస్కర్, ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.